నిజామాబాద్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ బహిరంగ సభలో అభివాదం చేస్తున్న మాజీ మంత్రులు మహమూద్‌అలీ, వేముల, శ్రీనివాస్‌గౌడ్, గంగుల, ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్, కల్వకుంట్ల సంజయ్, బీఆర్ఎస్ నిజామాబాద్ అభ్యర్థి బాజిరెడ్డి, ఎమ్మెల్సీ ఎల్ రమణ, మాజీ ఎమ్మెల్యేలు బిగాల, జీవన్‌రెడ్డి, విద్యాసాగర్‌రావు, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్

కాంగ్రెస్ అంటేనే దొంగల పార్టీ

- మత విద్వేషాలు రెచ్చగొడుతున్న బీజేపీ
- మాజీ డిప్యూటీ సీఎం మహమూద్ అలీ ఫైర్
- మోదీ, రేవంత్ ఒక్కటే: మాజీ మంత్రి వేముల
- రైతుల గోసను పట్టని సర్కారు: గంగుల, శ్రీనివాస్‌గౌడ్
- నిజామాబాద్‌లో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 19: కాంగ్రెస్ అంటేనే దొంగల పార్టీ.. ఆరు గ్యారెంటీల పేరుతో అధికారం చేపట్టి ప్రజలను వంచించిన ఘనత ఆ పార్టీదని మాజీ ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ వస్తే మార్పు వస్తుందని ఊదరగొట్టారని, వంద రోజుల పాలనకే ప్రజలను ఇబ్బందుల్లోకి నెట్టారని మండిపడ్డారు. శుక్రవారం నిజామాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా బాజిరెడ్డి గోవర్ధన్ నామినేషన్ దాఖలు చేసిన సందర్భంగా నగరంలో నిర్వహించిన బీఆర్ఎస్ భారీ బహిరంగ సభలో మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్, వీ శ్రీనివాస్‌గౌడ్, రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్, కే సంజయ్, ఎమ్మెల్సీ ఎల్ రమణ, మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, బిగాల గణేశ్‌గుప్తా, విద్యాసాగర్‌రావు, నిజామాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహమూద్ అలీ మాట్లాడుతూ.. తెలంగాణ సాధించిన కేసీఆర్ నాయకత్వాన్ని పొరపాటున కోల్పోయామని ప్రజలు బాధ పడుతున్నారని తెలిపారు. దొంగ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తెలంగాణను బర్‌బాత్ చేస్తున్నదని విమర్శించారు. బీజేపీ విద్వేషాలు రెచ్చగొడుతున్నదని, హిందూ, ముస్లింల మధ్య చిచ్చు పెడుతున్నదని మండిపడ్డారు.

కాంగ్రెస్, బీజేపీలను బొందపెట్టాలి..

మోదీ, రేవంత్‌రెడ్డి ఒక్కటేనని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కరీంనగర్ టికెట్ అడిగితే నిజామాబాద్‌లో నిలబెడుతున్నారని, ఇక్కడ బీజేపీ అభ్యర్థి అర్వింద్‌ను గెలిపించేందుకు రెండు పార్టీలు కలిసి పని చేస్తున్నాయని విమర్శించారు. పసుపుబోర్డు తెస్తానని బాండ్ పేపర్ రాసిచ్చి గత ఎన్నికల్లో గెలిచిన ఎంపీ అర్వింద్‌కు ఈసారి గట్టి బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. మరో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పదేండ్లు ఎంతో కష్టపడి తెలంగాణను దేశంలోనే నంబర్‌వన్‌గా నిలబెట్టారని తెలిపారు. కేసీఆర్ పాలనలో ఉన్న కరెంట్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎందుకు పోతున్నదని ప్రశ్నించారు. సాగునీరు లేక పంటలు ఎండిపోయి రైతులు ఆగమవుతుంటే వారిని పట్టించుకునే వారే లేరని మాజీ మంత్రి గంగుల కమలాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. నిజామాబాద్, జగిత్యాల జడ్పీ చైర్‌పర్సన్లు విఠల్‌రావు, వసంత, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ సతీమణి ఆయేషా ఫాతిమా, నిజామాబాద్ మేయర్ నీతూకిరణ్ పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డి మాటలు బూటకం.. నిధులు అబద్ధం

- ఆయనకు ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయం
- బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి ఫైర్

హైదరాబాద్, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ): కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలంగాణకు, సికింద్రాబాద్ నియోజకవర్గానికి చేసిందేమీ లేదని, ఆయన చెప్తున్న మాటలన్నీ బూటకమని బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి విమర్శించారు. కేంద్రం నుంచి పదేండ్లలో తెలంగాణకు రూ.పది లక్షల కోట్లు, సికింద్రాబాద్ నియోజకవర్గానికి రూ.46 వేల కోట్లు తెచ్చానడం అబద్ధమని పేర్కొన్నారు. సికింద్రాబాద్‌కు రూ.46 వేలు కోట్లు తెచ్చి ఉంటే, అసెంబ్లీ ఎన్నికల్లో సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఒక్క సీటు కూడా బీజేపీ ఎందుకు గెలవలేదని ప్రశ్నించారు. కిషన్‌రెడ్డి ఎన్ని రిపోర్టులు ఇచ్చినా ఆయన అసలైన రిపోర్టు ప్రజల దగ్గర ఉన్నదని, ఆయనకు ఈ ఎన్నికల్లో ప్రజలు సరైన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. కిషన్‌రెడ్డికి ఎన్నికలప్పుడే ప్రజలు గుర్తొస్తారని ఎద్దేవా చేశారు. సికింద్రాబాద్‌లో మళ్లీ కిషన్‌రెడ్డి గెలిచే పరిస్థితి లేదని చెప్పారు. బీజేపీకి జీహెచ్ఎంసీలో ఉనికే లేదని పేర్కొన్నారు. రైల్వేస్టేషన్‌లో లిఫ్టులు, కుర్‌కురే ప్యాకెట్లు పంచడం తప్ప కిషన్‌రెడ్డి ఏం సాధించారని ఎద్దేవా చేశారు. రాజ్యాంగ పరంగా కేంద్రం నుంచి రావాల్సిన నిధులను కూడా కిషన్‌రెడ్డి బీజేపీ అకౌంట్లో వేసుకుంటే ఎలా అని ప్రశ్నించారు. ఆసెంబ్లీ ఎన్నికల్లో ముగ్గురు బీజేపీ ఎంపీలు పోటీ చేసి ఓడిపోయారని, కేంద్రం నుంచి నిధులు తెస్తే వారు ఎందుకు ఓడిపోయారని నిలదీశారు. తమిళనాడు ఓట్ల కోసం గోదావరి జలాలను ఇచ్చంపల్లి నుంచి తరలించుకుపోయేందుకు బీజేపీ కుట్ర చేస్తున్నదని మండిపడ్డారు.

రుణమాఫీ పేరిట దగా

- భట్టి వ్యాఖ్యలు 70 లక్షల రైతులను వంచించటమే
- అన్నదాతల పాలిట శాపాలుగా కాంగ్రెస్, బీజేపీ
- రైతు హామీల అమలుకు పోస్టు కార్డు ఉద్యమం
- సర్కారు వడ్లు కొనేదాకా వారికి అండగా ఉండాలి
- నిరుద్యోగభృతి ఎగవేత.. రుణమాఫీపై దాటవేత
- ఎన్నికల్లో కారుకు ఓటుతోనే మైనార్టీలకు భద్రత
- సిద్దిపేట బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, శ్రేణులతో మాజీమంత్రి హరీశ్ టెలీకాన్ఫరెన్స్
- జహీరాబాద్‌లో 'ఈద్-మిలాప్'కు హాజరు

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

సిద్దిపేట/కోహీర్/సంగారెడ్డి, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ): వంద రోజుల్లో రైతు రుణమాఫీ చేస్తామని గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం.. రైతులను వంచించిందని మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. శుక్రవారం ట్విట్టర్‌లో డిప్యూటీ సీఎం భట్టి వ్యాఖ్యలపై మండిపడ్డ హరీశ్.. సిద్దిపేట నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో కాంగ్రెస్, బీజేపీపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జహీరాబాద్‌లో బీఆర్ఎస్ నిర్వహించిన ఈద్-మిలాప్ కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌తో కలిసి పాల్గొన్న ఆయన.. మీడియాతో మాట్లాడారు. 'కాంగ్రెస్‌లో అబద్ధాల పోటీ కొనసాగుతున్నది. ఆ పార్టీ ఆరు గ్యారెంటీలు నూరు అబద్ధాలతో సమానం. 100 రోజుల్లో రుణమాఫీ చేస్తామని హామీ ఇవ్వలేదని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొనటం రాష్ట్రంలోని 70 లక్షల మంది రైతులను ఘోరంగా వంచించటమే. డిసెంబర్ 9నే రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడి హోదాలో చెప్పడమే గాక, సీఎంగా తొలి సంతకం రుణమాఫీపైనే అని చెప్పిన విషయం భట్టికి తెలియనట్టు నటించటం హాస్యాస్పదం. అబద్ధాల్లో సీఎం రేవంత్‌రెడ్డితో భట్టి విక్రమార్క పోటీ పడుతున్నారు. నిరుద్యోగ భృతిపై కాంగ్రెస్ ఎలాంటి హామీ ఇవ్వలేదని నిండు అసెంబ్లీలో ప్రకటించి అభాసుపాలైన భట్టి.. తాజాగా రుణమాఫీపై కూడా నాలుక మడతబెట్టారు. ఏరుదాటే దాకా ఓడమల్లన్న.. ఏరు దాటాక బోడి మల్లన్న అన్నట్టు ఉన్నది కాంగ్రెస్ నాయకుల పరిస్థితి. ఎన్నికల ముందు హామీల వర్షం గుప్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ, అయిపోయాక మొండి చేయి చూపిస్తున్నది. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో తప్పకుండా బుద్ధి చెప్తారు. నిన్న నిరుద్యోగభృతిపై ఎగవేత, నేడు రైతు రుణమాఫీపై దాటవేత ధోరణి. కాంగ్రెస్ నేతల మోసాలకు సాక్షాలివిగో' అంటూ భట్టి వ్యాఖ్యలను పోస్ట్ చేశారు. రైతులకు ఇచ్చిన ఏ హామీని కాంగ్రెస్ నిలబెట్టుకోలేదని, అడ్డగోలు హామీలతో గద్దెనెక్కిన ఆ పార్టీ ఇప్పుడు రైతులను అన్నివిధాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నదని ఆరోపించారు. మార్కెట్లకు వడ్లు వచ్చినా ఎందుకు కొనటం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గన్నీ బ్యాగ్‌లు అందుబాటులో లేవని, రైస్‌మిలర్స్ అలాంట్‌మెంట్ కాలేదని తెలిపారు. ప్రభుత్వం మద్దతు ధర రూ.2,203 ప్రకటించినా, 15 రోజుల నుంచి ధాన్యం కొనటం లేదని మండిపడ్డారు. ప్రభుత్వ మొద్దు నిద్ర వీడకపోవడంతో రైతులు వ్యాపారులకు తక్కువ ధరకు ధాన్యం అమ్ముకొని నష్టపోతున్నారని వెల్లడించారు. వ్యాపారులకు రూ.1,800కే క్వింటాల్ ధాన్యం అమ్ముకోవటంతో రైతులు రూ.400 నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 500 రూపాయలు బోనస్ ఇవ్వకపోగా, రైతులకు 400 బొక్క పెడుతున్నారని కాంగ్రెస్ సర్కారు తీరును ఎండగట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో చివరి గింజవరకు కొని మద్దతు ధర ఇచ్చామని గుర్తుచేశారు. డిసెంబర్ 9న రూ.2 లక్షల రుణమాఫీ, రూ.15 వేలు, రైతుభరోసా, కౌలు రైతుకు ఎకరాకు రూ.12 వేలు ఇస్తామని మోసం చేసిందని విమర్శించారు. వరి, మక్క జొన్నకు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ తెచ్చిన కరువు

రాష్ట్రంలో కరువు.. కాలం తెచ్చింది కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిందని హరీశ్ విమర్శించారు. రాష్ట్రంలోని రెండు జిల్లాల్లోనే లోటు వర్షపాతం ఉన్నదని తెలిపారు. అవసరమైతే దీనిపై బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవటం లేదని, సీఎం, మంత్రులు ముఖం చాటేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 200 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నా.. సీఎం కానీ, మంత్రులు కానీ ఒక్క రైతు కుటుంబాన్నీ పరామర్శించలేదని మండిపడ్డారు. నల్లచట్టాలు తెచ్చిన కేంద్ర బీజేపీ సర్కారు 700 మంది రైతులను పొట్టన పెట్టుకున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్రోధరలు పెంచి పేద, మధ్య తరగతి ప్రజలపై మోదీ సర్కారు మోయలేని భారం మోపిందని విమర్శించారు. దుబ్బాక ఎన్నికల ప్రచారంలో రైతులకు ఎడ్లు, నాగలి ఇస్తానని మోసం చేసిన బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావును దుబ్బాక ప్రజలు బండకేసి కొట్టారని తెలిపారు. దుబ్బాకలో చెల్లని వ్యక్తి మెదక్‌లో ఎలా చెల్లుతాడు? అని ఎద్దేవా చేశారు. జాతీయ పార్టీలు రైతుల పాలిట శాపాలుగా మారాయని విమర్శించారు. ఈ పార్టీలకు ఓటుతో బుద్ధి చెప్పాలని రైతులకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు అమలు అయ్యేదాకా పోరాటం చేయాలని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలకు పిలుపనిచ్చారు. రైతు వడ్ల కల్లాల వద్దకు వెళ్లాలని, సీఎంకు పోస్ట్ కార్డు రాసి పంపాలని సూచించారు. ప్రతి గ్రామంలో పోస్ట్ కార్డు ఉద్యమం చేపట్టి రైతులకు అండగా నిలవాలని చెప్పారు. కొనుగులు కేంద్రాలు ప్రారంభించాలని రెవెన్యూ అధికారులను అడగాలని, లేనిపక్షంలో రైతులకు అండగా రాస్తారోకోలు, ధర్నాలు, ఆందోళనలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

బీఆర్ఎస్‌కు ఓటు వేస్తేనే మైనార్టీలకు భద్రత

రాష్ట్రంలోని మైనార్టీలు కాంగ్రెస్‌కు ఓటు వేస్తే బీజేపీకి ఉపయోగపడుతుందని, బీఆర్ఎస్‌కు ఓటు వేస్తేనే వారికి భద్రత ఉంటుందని హరీశ్ అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ కలిసిపోయాయని, ఎన్నికల్లో పరస్పరం సహకరించుకుంటున్నాయని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీ కనుసన్నల్లో పనిచేస్తున్నారని, ఆయన రాజకీయ పునాదులు ఆరెస్సెస్‌లో ఉన్నాయని విమర్శించారు. రేవంత్‌రెడ్డి ఒరిజినల్ కాంగ్రెస్ కాదని, రేవంత్ ఎజెండా, రాహుల్‌గాంధీ ఎజెండా వేర్వేరు అని తెలిపారు. మైనార్టీలను రేవంత్ తన మంత్రివర్గంలోకి ఎందుకు తీసుకోవటం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ రంజాన్ తోఫాలను ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. కేసీఆర్ హయాంలో అన్ని మతాల ప్రజలు సామరస్యంతో జీవించారని గుర్తుచేశారు. కరీంనగర్, వరంగల్, మల్కాజిగిరి, సికింద్రాబాద్‌లో బీజేపీ గెలిచేలా కాంగ్రెస్ సహకరిస్తున్నదని ఆరోపించారు. సెక్యులరిజాన్ని కాపాడాలంటే ఎంఐఎం సైతం బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు.

ఉద్యోగుల సస్పెన్షన్‌పై స్టే

హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

హైదరాబాద్, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల కార్యక్రమంలో పాల్గొన్నారన్న కారణంతో కొందరు ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ ఎన్నికల అధికారి హోదాలో సిద్దిపేట కలెక్టర్ ఇటీవల జారీచేసిన ఉత్తర్వుల అమలును హైకోర్టు నిలిపివేసింది. ఈ నెల 8న జారీ అయిన ఈ ఉత్తర్వులకు వ్యతిరేకంగా సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ కంప్యూటర్ ఆపరేటర్ శ్రీనివాస్, మరో ముగ్గురు సెర్ప్ ఉద్యోగులు దాఖలు చేసిన వ్యాజ్యాలపై జస్టిస్ పుల్లా కార్తీక్ శుక్రవారం విచారణ చేపట్టారు. బీజేపీ మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఫిర్యాదు మేరకు ప్రజాప్రాతినిధ్య చట్టంలోని 129, 134 సెక్షన్ల కింద 66 మంది ఉద్యోగులను సస్పెండ్ చేశారని పిటిషనర్ల తరపు న్యాయవాది వాదించారు. పిటిషనర్లు సివిల్ సర్వెంట్లు కారని, వారికి ఎలాంటి ఎన్నికల విధులు అప్పగించనందున 129,134 సెక్షన్లు వర్తించవని వివరించారు. పిటిషనర్లను సస్పెండ్ చేసే అధికారం కలెక్టర్‌కు లేదని తెలిపారు. దీంతో సస్పెన్షన్ ఉత్తర్వుల అమలుపై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేసిన న్యాయమూర్తి.. తదుపరి విచారణను జూన్ 25కి వాయిదా వేశారు. ఈలోగా కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు.

వంద రోజుల్లో రుణమాఫీ అనలే

మొదటిపేజీ తరువాయి...

వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ) శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో 'విద్యుత్తు-తాగునీరు-ఆర్థికం' అంశాలపై భట్టి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా మీడియా అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానాలు చెప్పారు. రైతుబంధు కోసం గత ప్రభుత్వం రూ. 7 వేల కోట్లను అకౌంట్‌లో వేసిందన్న దాంట్లో వాస్తవం లేదని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై రిజర్వుబ్యాంకు వద్దనున్న రికార్డుల ప్రకారం గత ప్రభుత్వం తమకు రూ. 3,690 కోట్ల లోటు బడ్జెట్‌తో రాష్ట్రాన్ని అప్పగించిందని వివరించారు. అందుకు సంబంధించి రిజర్వు బ్యాంకు పత్రాలను మీడియాకు చూపించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు రైతుబంధుకు రూ. 7 వేల కోట్లు కేటాయించామని, ఎన్నికల సంఘం అనుమతి ఇస్తే రైతుల ఖాతాల్లో వేస్తామని బీఆర్ఎస్ ప్రభుత్వం చెప్పిందని, మరి ఆ రూ. 7 వేల కోట్లు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఆ డబ్బులు ఎక్కడికి? ఎవరికి ఖాతాల్లోకి వెళ్లాయని నిలదీశారు. ఆ సొమ్ము ఎవరి దగ్గర ఉందో కేసీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు ఈ నాలుగు నెలల్లో వడ్డీలు, అప్పులతో కలిపి మొత్తం రూ.26,374 కోట్లు చెల్లించినట్టు వివరించారు. గత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసిందని, తాము రూపాయి రూపాయి పోగేసి ఒకటో తేదీన ఉద్యోగులు, పెన్షన్‌దారులకు వేతనాలు, పింఛన్లు చెల్లిస్తున్నట్టు తెలిపారు.

ఆ ఆరోపణల్లో నిజం లేదు

రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారనేది ఆరోపణలు మాత్రమేనని భట్టి పేర్కొన్నారు. కాంగ్రెస్ కరువు తీసుకొచ్చిందంటూ తమ ప్రభుత్వాన్ని కొందరు బద్నాం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం ప్రాజెక్టుల్లో నీటిని వృథాగా వదిలి కృత్రిమ కరువు సృష్టించారని ఆరోపించారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల్లోని నీటిని జాగ్రత్తగా భద్రపరుచుకొని వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చూసుకోవాల్సిన బాధ్యతను విస్మరించి ఎన్నికల్లో ఓట్లు పొందడానికి కాలువల వెంట నీళ్లు పారించి వృథాగా సముద్రంలోకి వదిలారని మండిపడ్డారు. మేడిగడ్డ కుంగడం వల్లే గత పాలకులు నీటిని దిగువకు వదిలారని ఆరోపించారు. నీటి యాజమాన్య పద్ధతులు పాటించకపోవడం వల్లే ఇప్పుడు నీటి కొరత ఎదురైందని విమర్శించారు. వారు చేసిన తప్పులను సరిదిద్దుతున్నామని, అధికారులతో నిత్యం సమీక్షిస్తూ రూ. 100 కోట్లు అందుబాటులో ఉంచామని తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్‌లో తాగునీటి కొరత రానివ్వబోమన్న భట్టి.. గత ప్రభుత్వం రూ. 43 వేల కోట్లతో ఏర్పాటుచేసిన మిషన్ భగీరథ పథకం ప్రయోజనం ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు.

కిషన్‌రెడ్డి చెప్పింది అబద్ధం

కేంద్రమంతి కిషన్‌రెడ్డిని ఉద్దేశించి గడిచిన పదేండ్లలో రాష్ట్రానికి రూ. 10 లక్షల కోట్లు ఇచ్చామని ఓ కేంద్రమంత్రి చెప్పడం అబద్ధమని భట్టి పేర్కొన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చింది రూ. 3,70,235 కోట్లు మాత్రమేనని తెలిపారు. పన్నుల నుంచి రాష్ట్రానికి వాటాగా రావాల్సిన వాటా కూడా చెల్లించకుండా ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఆయన మాట్లాడుతున్నారని విమర్శించారు. కేంద్రం రూ. 10 లక్షలు ఇచ్చింది నిజమే అయితే గత ప్రభుత్వం రూ. 7 లక్షల కోట్లు ఎందుకు అప్పు చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా పథకం కింద తమ ప్రభుత్వం 65 లక్షల మంది రైతులకు రూ.5,575 కోట్లు చెల్లించినట్టు తెలిపారు. మిగిలిన 5 లక్షలమంది రైతుల ఖాతాల్లోనూ డబ్బులు వేస్తున్నట్టు చెప్పారు. నాలుగు నెలల్లోనే 93 శాతం మంది రైతులకు భరోసా డబ్బులు చెల్లించినట్టు వివరించారు. గత ప్రభుత్వం చెల్లించని రైతు బీమా ప్రీమియం రూ. 734 కోట్లను కూడా తామే చెల్లించినట్టు పేర్కొన్నారు.

కొత్త విద్యుత్తు పాలసీ అవసరం

విద్యుత్తు రంగంలో ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా గత ప్రభుత్వం ఎలాంటి కృషి చేయలేని భట్టి విమర్శించారు. ఒక్కో యూనిట్‌ను రూ. 20 చొప్పున కొనుగోలు చేసి ప్రజలపై భారం మోపిందని మండిపడ్డారు. తమ ప్రభుత్వం మాత్రం పీక్ అవర్స్‌లో పవర్ ఎక్స్‌చేంజ్ నుంచి యూనిట్‌ను రూ. 10 చొప్పున కొనుగోలు చేస్తున్నట్టు చెప్పారు. విభజనచట్టంలో ఎన్టీపీసీ నుంచి 4 వేల మెగావాట్ల విద్యుత్తును కేటాయించినప్పటికీ పదేండ్లు అధికారంలో ఉండి దానిని విస్మరించారని మండిపడ్డారు. యాదాద్రి, భద్రాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్‌లను ప్రారంభించి వాటిని తెలంగాణకు గుదిబండగా మార్చిన బీఆర్ఎస్ ఇప్పుడు రాజకీయ లబ్ధికోసం ఎన్టీపీసీ విద్యుత్తు గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు.

ఐదేండ్లు ఢోకా లేదు

ఎవరెన్ని కుట్రలు చేసినా కాంగ్రెస్ ప్రభుత్వానికి ఐదేండ్లు ఎలాంటి ఢోకా లేదని భట్టి విక్రమార్క ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. కొట్లాడి సాధించుకున్న రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకు తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీగా ఈ ఐదేండ్లు కృషిచేస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రజలపై పన్నుల భారం మోపకుండా రాష్ట్ర ఆదాయాన్ని పెంచుతామని డిప్యూటీ సీఎం చెప్పుకొచ్చారు. ఈ సమావేశంలో మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్‌రెడ్డి, యూనియన్ అధ్యక్షుడు విరాహత్ అలీ, సీనియర్ జర్నలిస్ట్ దిలీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసాపై భట్టి ఉట్టిమాటలు

- 65 లక్షలమందికి ఇచ్చామన్న భట్టి
- అందింది 61 లక్షల మందికే
- మంత్రి భట్టివిక్రమార్క మాటలకు, వ్యవసాయశాఖ లెక్కలకు మధ్య వ్యత్యాసం

హైదరాబాద్, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ): రైతు భరోసా కింద 65 లక్షల మంది రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేశామన్న డిప్యూటీ సీఎం, ఆర్థికమంత్రి భట్టివిక్రమార్క మాటలకు, వ్యవసాయశాఖ వద్దనున్న గణాంకాలకు, క్షేత్రస్థాయిలో రైతులు చెప్తున్నదానికి ఏమాత్రం పొంతన కుదరడం లేదు. మంత్రి చెప్పింది నిజమైతే ఆరెకరాలున్న రైతులకు కూడా ఈపాటికి డబ్బులు జమ అయ్యేవి. ఐదెకరాలున్నా తమకు డబ్బులు పడలేదని రైతులు చెప్తున్నారు. వ్యవసాయశాఖ వద్ద ఉన్న అధికారిక లెక్కల ప్రకారం ఇప్పటి వరకు రైతుభరోసా సాయం అందింది 61 లక్షలమంది రైతులకు మాత్రమే. గత వానకాలంలో ఐదెకరాలున్న రైతుల సంఖ్య 61 లక్షలు. అంటే ఈ లెక్కన వారికి కూడా రైతుభరోసా డబ్బులు పడి ఉండాలి. మంత్రి చెప్తున్నట్టు 65 లక్షలమంది రైతులకు చెల్లించి ఉంటే వారిలో ఆరెకరాల రైతులు కూడా వారిలో ఉండేవారు. వ్యవసాయశాఖ వద్దనున్న తాజా సమాచారం ప్రకారం ఇప్పటి వరకు దశలవారీగా 61.38 లక్షలమందికి మాత్రమే సాయం చెల్లించారు. మంత్రి చెప్తున్న గణాంకాలకు, వాస్తవ లెక్కలకు మధ్య భారీ తేడా ఉండడంతో విమర్శలు వినిపిస్తున్నాయి.

సభా ప్రాంగణంలో జనం లేక బస్సులోనే వేచి ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి

రాముడిపై ప్రమాణం.. వడ్లకు బోనస్

- వచ్చే వానకాలం నుంచే అమలు
- ఆగస్టు 15 నుంచి రూ.2లక్షల రుణమాఫీ
- భద్రాద్రిరామయ్య సాక్షిగా సీఎం రేవంత్ మళ్లీ హామీ
- రాష్ట్ర ఏర్పాటును మోదీ తప్పబట్టిండు
- మానుకోట సభలో సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ మహబూబాబాద్ (నమస్తే తెలంగాణ): 'వడ్లకు ఐదువందలు బోనస్ ఇస్తం.. రూ.2లక్షల రుణమాఫీ చేస్తం' అని అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చి.. అధికారంలోకి వచ్చాక రైతులను ఇన్నిరోజులూ మభ్యపెట్టి.. ఇప్పుడు లోక్‌సభ ఎన్నికలు వచ్చాయని మళ్లీ అదే హామీని ఎత్తుకున్నారు సీఎం రేవంత్‌రెడ్డి. ఆరు గ్యారంటీలపై ప్రజల్లో నమ్మకం సడలడంతో సాక్షాత్తు భద్రాద్రి రాముడిపైనే ప్రమాణం చేసి వచ్చే వానకాలం పంట నుంచి వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని, ఆగస్టు 15లోగా రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని మరోమారు ఎన్నికల ప్రచారంలో వాగ్దానం చేశారు. శుక్రవారం ఉదయం మహబూబ్‌నగర్‌లో కార్నర్ మీటింగ్ నిర్వహించిన ఆయన, సాయంత్రం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన సభలో మాట్లాడారు. తల్లిని చంపి, బిడ్డను బతికించారని పార్లమెంట్‌లోనే తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించిన మోదీ, ఈ ఎన్నికల్లో తెలంగాణ ప్రజల ఓట్లను ఎలా అడుగుతారని ప్రశ్నించారు. రాష్ట్ర విభజన చట్టంలో ఉన్న బయ్యారం ఉక్కు, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీలను ఈ పదేళ్లలో ఎందుకు ఏర్పాటు చేయలేదని నిలదీశారు. గిరిజన యూనివర్సిటీని కూడా కాలయాపన చేసి ఇటీవల ప్రారంభించారని ఎద్దేవా చేశారు. 'ఏపీ, తెలంగాణలో కలిపి మొత్తం 42మంది ఎంపీలుంటే కేవలం ఒక కేంద్ర మంత్రి పదవి ఇచ్చారు. అదే గుజరాత్‌లో ఏడు, ఉత్తరప్రదేశ్‌లో 12మందికి కేంద్ర మంత్రి పదవులిచ్చారు. తెలంగాణకు ఓ న్యాయం, గుజరాత్‌కు మరో న్యాయమా? ఈ దేశమేమన్న మీ అయ్యా జాగీరా?' అని ప్రశ్నించారు. ఉత్తర భారత దేశంలో కుంభమేళాకు, గంగానది శుద్ధికి వేల కోట్లు ఖర్చుపెట్టారని,